క్లుప్తంగా

పరవాడ ఓటింగ్ సరళిపై ఎమ్మెల్యేకు నివేదిక



ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు ఓటింగ్ సరళిని వివరిస్తున్న పరవాడ వైఎస్సార్‌సీపీ నేతలు

పరవాడ : సార్వత్రిక ఎన్నికల్లో పరవాడ ప్రాంతంలోని పోలింగ్ సరళిని రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు గురువారం వివరించారు. ఎమ్మెల్యే స్వగ్రామం రాంపురంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను కలిసి బూత్‌ల వారీగా పోలైన ఓటింగ్ గురించి వివరించారు. ఓటింగ్ తీరును బట్టి వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని స్పష్టమవుతుందని శ్రీనివాసరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పార్టీ నాయకులు బొద్దపు చిన్నారావు, బొద్దపు శ్రీనివాసరావు, కంచిపాటి భాస్కర్, బొండా శ్రీనివాసరావు, శేష సురేష్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో స్వచ్ఛత పక్వాడ



ఉద్యోగులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. దీపాంజలినగర్‌లోని సవ్యాస్ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ సింహాద్రిలో ఈ నెల 16 నుంచి 31 వరకు నిర్వహించనున్న స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. 15 రోజుల పాటు నిర్వహించనున్న స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీజీఎం సీవీజీ-3 రష్మీ రంజన్ పరిధా, ఆపరేషన్ జీఎం సురేష్ జాన్ డేవిడ్, వీజీజీ జీఎం నోవాహు గద్దం, టెక్నికల్ సర్వీసెస్ జీఎం ఎస్. పద్మప్రియ, హెచ్ఆర్ హెడ్ బి.బి.పాత్ర, జీఎంలు, ఇతర అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

షిర్డీ సాయినాథునికి పూజలు



పూజలందుకుంటున్న సాయిబాబా

మల్కాపురం: వైశాఖ మాసం గురువారం సందర్భంగా 60వ వార్డు పరిధి గుల్లలపాలెం, మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీసాయి బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. దీనిలో భాగంగా తెల్లవారుజామున ఆరు గంటలకు బాబాకు హారతి ఇచ్చారు. అనంతరం విభూధి, పంచామృతాలు, సుగంధ పుష్పాలతో బాబాకు అభిషేకం నిర్వహించారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పు రైతులను ముంచిన అకాల వర్షం



వర్షానికి గట్లపై ఉన్న ఉప్పు కరిగిపోయిన దృశ్యం

పరవాడ : వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెంలో సాగు చేస్తున్న ఉప్పుగల్లీలకు గురువారం తెల్లవారు జామున కురిసిన వర్షం వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. గ్రామంలో 150 ఎకరాల ఉప్పు పంట సాగవుతోంది. మడుల్లో పండిన ఉప్పును తీసి గట్లపై వేసి ఆ తర్వాత పాకల్లో నిల్వ చేద్దామనుకున్న తరుణంలో ఉన్నట్టుండి రాత్రి కుండపోతగా కురిసిన వర్షానికి ఉప్పు కరిగిపోయి నీటిపాలైందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వర్షం వెలిసిన తర్వాత వెళ్లి చూసి రైతులు కంట తడి పెట్టుకున్నారు. రూ. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పండించిన ఉప్పు వర్షానికి నీటి పాలైందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన ఉప్పుకు సరైన గిట్టుబాటు ధర లేక ఇప్పటికే నానా అవస్థలు పడుతున్న తరుణంలో ఆకాల వర్షాలు తీరని నష్టం తెచ్చిపెట్టాయని రైతులు వాపోతున్నారు. తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఉప్పు రైతులు కోరుతున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



శ్రీవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పెందుర్తి : వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వక్షేణ అరాధన, పుణ్యావహవచనం, అంకురార్పణ, బుత్సంగ్రహణం, యాగాశాల అర్చన, అగ్ని ప్రతిష్ట జరిగాయి. వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు జరుగుతాయి. మూడో రోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం జరగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు సాగుతూ భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామి వారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. తొలిరోజు పూజల్లో ఈవో నీలిమ, ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెద్దలకు బీసీజీ వ్యాక్సినేషన్ ప్రారంభం



వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

గాజువాక : అరవై ఏళ్లు దాటినవారంతా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర్‌రావు కోరారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పీహెచ్‌సీలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 ఏళ్లు దాటిన వారిలో సుగర్, బీపీ ఉన్నవారికి, అలాగే టీబీ వచ్చి ట్రీట్‌మెంట్ తీసుకున్న వారికి.. వారి ఇంట్లో 18 ఏళ్లు నిండినవారికి జీవితంలో టీబీ రాకుండా ఉండటానికి ప్రభుత్వం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. సచివాలయాల్లో ప్రతీ గురువారం ఈ వ్యాక్సిన్ వేస్తారని, 60 ఏళ్లు దాటినవారు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. 3 నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సామాజిక ఆరోగ్య విస్తరణాధికారి పి.నాగ అప్పారావు, హెల్త్ సూపర్‌వైజర్లు జి.రాము, రత్నాలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరకుల పంపిణీ



పేదలకు సరకులు అందజేస్తున్న గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ సభ్యులు

సబ్బవరం: మండలంలోని ఇరువాడలో గల కృప సహకార కేంద్రంలో హత్తుకొనే చేతులు కార్యక్రమంలో భాగంగా గురువారం పేదలు, వృద్ధులకు నిత్యావసర సరకులను అందజేశారు. గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పువ్వల విజయకుమార్, సభ్యులతో కలిసి సరకులు పంపిణీ చేశారు. ప్రతి నెలా 30 మంది పేదలు, వృద్ధులకు నిత్యావసర సరకులతోపాటు ప్రయాణ ఖర్చులు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం పేదలు, వృద్ధులకు అల్పాహారం ఏర్పాటు చేయడంతోపాటు రేషన్ సరకులు, ప్రయాణ ఖర్చులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమానికి పి.ప్రేమానందం కుటుంబ సభ్యులు కొంత ఆర్థిక సాయం చేసినట్లు విజయకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు దినేష్‌కుమార్, హావీలా, ఎస్.నాయుడు, స్మైలీ, దివ్యతేజ, రమణ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ ప్రారంభం



విద్యార్థులతో కథల పుస్తకాలు చదివిస్తున్న గ్రంథాలయ అధికారి పీవీ రమణ

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. అనంతరం విద్యార్థులతో ఆటలాడించారు. ఆపై వారికి బిస్కెట్లు, చాక్లెటు పంపిణీ చేశారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 12 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



స్వర్ణ పుష్పాలతో స్వామికి పూజ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

19 నుంచి బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు



గొల్లలపాలెం గ్రామదేవత పోలమాంబ



పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 28వ వార్డులో వెలసిన బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అమ్మవార్లను పలువురు ప్రముఖులు దర్శించుకోనున్నారు.

బంగారమ్మ పండగ..

పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ పండగ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 21 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పండగ చాటింపు చేపట్టనున్నారు. ఆ రోజు సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద స్టేజీ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. 20న సోమవారం తొలేళ్ల ఉత్సవం, సాయంత్రం 7 గంటల నుంచి స్టేజ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. 21న ప్రధాన పండగ జరపనున్నారు. ఉత్సవాల్లో గరిడీలు, కాళీ మాతా డ్యాన్స్‌లు, పులివేషాలు, తప్పెటగుళ్లు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. పితానిదిబ్బ, గొల్లలపాలెం, ప్రకాశరావుపేట, దిబ్బలపాలెం, భానోజీనగర్, కన్నయ్యపేట, విశ్వనాథం రోడ్డు, సింగ్ హోటల్ జంక్షన్ తదితర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు.

పోలమాంబ పండగ..

గొల్లలపాలెం గ్రామ ప్రజల ఆరాధ్యదైవం పోలమాంబ పండగ 19 నుంచి 21 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చాటింపు వేయనున్నారు. 20న తొలేళ్ల ఉత్సవం, 21న అనుపు కార్యక్రమం జరపనున్నారు. గొల్లలపాలెం, శెట్టిబలిజ సంఘం, బుద్ధలవానిపాలెం, రామ్‌నగర్, నెహ్రూనగర్, ఆది ఆంధ్ర గ్రామం, అశోక్‌నగర్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంత వాసులు పోలమాంబను ఆరాధిస్తుంటారు. పండగ నేపథ్యంలో స్థానికులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. ప్రధాన పండగ మంగళవారం రోజున అమ్మవారి సదునుపట్టు (ఆర్టీ క్లబ్ గొల్లలపాలెం) నుంచి అమ్మవారిని ధూప, దీప, నైవేద్యాలు, బాజా భజంత్రీలు, తప్పెటగుళ్లు, చెక్క భజన, పులివేషాలు, సాముగరిడీలతో భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు.

28న మారువారం జరపనున్నారు. ఉత్సవంలో భాగంగా వచ్చే నెల 9న ఆలయ ప్రాంగణం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పోలమాంబ అమ్మవారి ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



కాన్వెంట్ జంక్షన్‌కు కొత్త కళ తీసుకొచ్చిన అంబేడ్కర్ కూడలి



ఆకట్టుకుంటున్న వైజాగ్ పోర్ట్ సింబల్



పోర్టు ముఖద్వారం వద్ద ఆకట్టుకుంటున్న సీహార్స్ ప్రతిమలు

అందంగా.. ఆకర్షణీయంగా..

- చూడముచ్చటగా డాల్ఫిన్ కూడలి
- సరికొత్తగా సీహార్స్ ప్రతిమలు
- అదనపు హంగులతో జ్ఞానాపురం అంబేడ్కర్ జంక్షన్
- పచ్చదనం నడుమ వైజాగ్ పోర్ట్ సింబల్



డాల్ఫిన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటైన్

జగదాంబ : విశ్వనగరంగా ఖ్యాతి గడిస్తున్న విశాఖ రోజురోజుకు సరికొత్త అందాలను సంతరించుకుంటోంది. కాస్మోపాలిటన్ అందాలతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో దక్షిణలోని పలు ఏరియాలు మునుపెన్నడూ చూడనంత అందంగా.. ఆకర్షణీయంగా రూపొందిన చూపరుల చేత 'వావ్..'అనిపిస్తున్నాయి.

దేనికదే సాటి..

అల్లిపురం దరి డాల్ఫిన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్ ఆ ప్రాంతానికి కొత్త అందాలద్దుతోంది. గ్రీన్ సర్కిల్ నడుమ రెండు డాల్ఫిన్లు నీటిని బయటికి వెదజల్లుతున్నట్లు ఏర్పాటు చేసిన ప్రతిమలు అటుగా ప్రయాణించే వాహన చోదకులు.. పాదచారులను ఆకట్టుకుంటున్నాయి. అదే విధంగా పోర్టు ముఖద్వారం వద్ద గల సీహార్స్ (సముద్ర గుర్రాలు) కొంత కాలం క్రితం శిథిలమైపోయాయి. అయితే ఇటీవల వాటికి మరమ్మతు చేసి సరికొత్తగా తీర్చిదిద్దారు. రౌండ్ రెయిలింగ్ ఏరియాలో ఏర్పాటు చేసిన సీహార్స్ చూపరుల మనసు దోచుకుంటున్నాయి. అలాగే జ్ఞానాపురంలో ఏర్పాటు చేసిన వైజాగ్ పోర్ట్ సింబల్ కూడా ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. గ్రీనరీ, స్టీల్ రెయిలింగ్ నడుమ ఏర్పాటైన ఆ సింబల్ జ్ఞానాపురం ప్రాంతానికి సరికొత్త అందాలు తెచ్చిపెట్టింది. ఇక చివరిగా జ్ఞానాపురంలోనే ఏర్పాటైన అంబేడ్కర్ కూడలి కూడా చూడముచ్చటగా రూపుదిద్దుకుంది. చక్కటి సర్కిల్‌లో పూలమొక్కలు, రంగులు, విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేసిన ఈ ప్రతిమ ఆ ప్రాంతం నుంచి చాలా దూరం వరకు కనిపించేలా సుందరంగా తీర్చిదిద్దారు.

ఏ నలుగురు కలిసినా అదే చర్చ



గోపాలపట్నం: పెందుర్తిలో రాజకీయ నిశ్శబ్దం కొనసాగుతోంది. ఎన్నికల పోలింగ్ ముగియడం ..భారీగా ఓటర్లు తమ ఓటు వినియోగించుకోవడంతో దీనిపై చర్చలు కొనసాగుతున్నాయి. ఏ నలుగురు కలిసినా భారీగా నమోదైన పోలింగ్ సరళిపైనే మాట్లాడుకుంటున్నారు. వృద్ధులు, మహిళలు అధిక శాతం ఓటింగ్‌లో పాల్గొనడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఖుషీగా ఉన్నారు. అలాగే గత రికార్డులను తిరగరాసి అత్యధికంగా పోలింగ్ జరగడం కూడా చర్చకు దారి తీస్తోంది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థికి ముందస్తు శుభాకాంక్షలు కూడా చెబుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటింగ్ ఎక్కువ శాతం నమోదైందని అది తమకు అనుకూలమని టీడీపీ భావిస్తోంది. జూన్ 4వ తేదీ వరకు ఎవరి ఊహాగానాలు వారివి.. ఫలితాలు వచ్చే వరకు ఓటర్ల నాడి అంతుపట్టదు.

జోరుగా పందేలు...

పెందుర్తిలో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని కొందరు.. టీడీపీ గెలుస్తుందని కొందరు బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. లక్షల్లో పందేలు సాగుతున్నాయి. రాష్ట్రంలో మళ్లీ ఫ్యాన్ గాలి కొనసాగుతుందని, జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారని పలువురు బల్ల గుద్ది మరీ చెబుతున్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ దూరం



ఎన్జీజీవోస్ కాలనీలో ర్యాలీ చేస్తున్న విద్యుత్‌నగర్ ఆరోగ్య కేంద్రం సిబ్బంది

సీతంపేట: జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. దోమలు పెరిగే ప్రదేశాలు, దోమల నియంత్రణకు, జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంచారు. హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు, జిల్లా మలేరియా విభాగం, జీవీఎంసీ మలేరియా విభాగం, యాంటీ లార్వా ఆపరేషన్స్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ వ్యాధిని దూరం చేయవచ్చని పిలుపునిచ్చారు.

డ్రైడే పాటించండి

నరసింహనగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారి మనోజ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ దోమలు నిల్వ ఉన్న మంచినీరు, వర్షపు నీటిలో వృద్ధి చెందుతాయన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి నీటి నిల్వలను మార్చడం ద్వారా దోమల పెరుగుదలను నియంత్రించి, తద్వారా డెంగ్యూ వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

దోమ తెరలు వాడండి

అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని విద్యుత్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుధీర్ మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ దోమలు మంచినీటిలో పెరుగుతాయని, వారానికి ఒకరోజు డ్రై డేపాటించడం ద్వారా దోమల వృద్ధిని నియంత్రించవచ్చన్నారు. దోమల కాటు నుంచి రక్షణకు దోమ తెరలు వాడటం, శరీరాన్ని పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించాలని సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం నుంచి ఎన్జీజీవోస్ కాలనీలోని పలు ప్రాంతాల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎల్.శ్రీనివాసరావు, హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు, ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రావణి ప్రారంభించారు. రైల్వే న్యూకాలనీ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ చేసి, స్థానికులపై డెంగ్యూ వ్యాధి నివారణపై అహగాహన కల్పించారు. ఆరోగ్యం కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.